క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

సీతంపేట: ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్‌లో తమ మొబైల్ నంబర్‌తో లాగిన్ అవ్వాలని ఎంపీడీఓ కె.గీతాంజలి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని లాగిన్ అవ్వాలని సూచించారు. గ్రామ వలంటీర్ వచ్చి లాగిన్ చేయాల్సిన అవసరం లేదని, మీకు మీరే లాగిన్ అయ్యే వెసులుబాటు ఉందన్నారు. ఈ నెల 21 వరకు కుటుంబ సభ్యుల్లో కొత్తవారిని ఆరోగ్యశ్రీ కార్డులో చేర్చేందుకు అవకాశం ఉందన్నారు.

'నా భూమి-నా దేశం'


ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

సీతంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం మేరా మటి మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కె.గీతాంజలి ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. స్వాతంత్ర్య సమర యోధులను త్యాగాలను స్మరించుకున్నారు. స్థానికంగా మట్టిని సేకరించి ఢిల్లీకి పంపించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.సత్యం, ఏపీఓలు బాబురావు, సాగర్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

వాంతులు, విరేచనాలతో చిన్నారి మృతి

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ఆస్పత్రిలో వాంతులు, విరేచనాలకు చికిత్స పొందుతూ నాలుగు నెలల చిన్నారి బిడ్డిక అద్వితేజ్ మంగళవారం రాత్రి మృతిచెందాడు. లక్కగూడకు చెందిన ప్రసాద్, కావేరిల కుమారుడు అద్వితేజ్‌కు వాంతులు, విరేచనాలు ఎక్కువ కావడంతో శుక్రవారం భద్రగిరి ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి ఎస్ఎన్‌సీయూలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి వైద్యులు రిఫర్ చేశారు. అంబులెన్స్ వచ్చేలోగా చిన్నారి మృతిచెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఘనంగా కొమ్మల పండగ


ఘనసర గ్రామదేవత సన్నిధిలో పత్తిరి కొమ్మలు అమర్చుతున్న రైతులు

భామిని: మండలంలో దేవీ నవరాత్రులలో భాగంగా మంగళవారం పత్తిరి కొమ్మల పండగ ఘనంగా జరుపుకున్నారు. రైతులు పత్తిరి కొమ్మలను గ్రామదేవత సన్నిధిలో ఉంచి సాంప్రదాయంగా పూజలు చేశారు. అనంతరం వాటిని పంట పొలాల్లో నాటారు. బాలేరులో మహిళలు ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా కళాకారుడు కరణం కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అలాగే ఘనసర, కీసర గ్రామాల్లోనూ పత్తిరి కొమ్మల పండగ చేశారు.


బాలేరులో ఘటాల ఊరేగింపులో మహిళల కోలాటం

పౌష్టికాహారంతోనే అందరికీ ఆరోగ్యం


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ జగన్నాథరావు

సీతానగరం: ప్రజలు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యవంతంగా ఉంటారని గుర్తించాలని డీఎంహెచ్ఓ బి.జగన్నాథ రావు అన్నారు. ఈ మేరకు మండలంలోని దయానిధిపురంలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచితవైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష ఉచితవైద్య శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. ప్రజలకు స్పెషలిస్ట్ డాక్టర్లతో ఉచిత వైద్యశిబిరాల్లో నాణ్యమైన వైద్యసేవలందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఐసీడీఎస్ అధికారులు ఏర్పాటు చేస్తున్న పౌష్టికాహార స్టాల్స్ నుద్దేశించి మాట్లాడుతూ ప్రజలు పౌష్టికాహారం తీసుకోనందునే అనేక రకాల వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ఆకుకూరలు, కాయ గూరలు నిర్దేశించిన పాళ్లలో తీసుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఉచితవైద్య శిబిరాలను ప్రజలు వినియోగించు కోవాలని కోరారు.


పాలకొండ: అన్నపూర్ణాదేవిగా కోటదుర్గమ్మ


వీరఘట్టం: పూజలందుకుంటున్న కోటదుర్గ అమ్మవారు


భామిని: బత్తిలిలో దుర్గామాతకు పూజలు చేస్తున్న భవానీ భక్తులు


పాలకొండ: కోటదుర్గమ్మ ఆలయంలో కుంకుమపూజలు చేస్తున్న మహిళలు

అన్నపూర్ణగా అమ్మవారు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాలకొండ కోటదుర్గ అమ్మవారు మంగళవారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఘటాలతో ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించారు. భవానీ మాలధారణ భక్తులు అమ్మవారి శరణుఘోష చేశారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ మురళీధర్, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరఘట్టం కోటదుర్గమ్మ ఆలయంలో యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో భవానీ పూజలు కొనసాగుతున్నాయి.

– సాక్షి పాలకొండ/కురుపాం

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్
- మల్లమ్మగూడలో 'గడపగడపకు మన ప్రభుత్వం'


మల్లమ్మగూడలో సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషాలు నిండాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని సింగన్నవలస పంచాయతీ పరిధి మల్లమ్మగూడలో మంగళవారం నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయంటూ లబ్ధిదారులంతా ఎమ్మెల్యే వద్ద తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ.. సుపరిపాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు.

అర్హులందరికీ పథకాలు అందేలా చూడండి..

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సింగన్నవలస సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లతో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సూచించారు. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి నివేదిక తయారు చేసి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు కనపాక సూర్యప్రకాశరావు, వెలమల మన్మథరావు, పార్టీ నాయకులు బలగ మన్మథరావు, శివ, నర్సింగరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

- కలెక్టర్ నిషాంత్‌కుమార్


నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి సంబంధిత శాఖలకు అప్పగించాలని జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని ఎల్విన్‌పేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను గ్రామస్థాయిలోనే అందించేందుకు వీలుగా గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. అందుకు అవసరమైన భవనాల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ కోట్లాది రూపాయల నిధులు కూడా మంజూరు చేసిందన్నారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి భవనాలను ప్రారంభానికి సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ జె.రాములమ్మ, తదితరులున్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి


సిబ్బందికి సూచనలు చేస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏలో మంగళవారం హౌసింగ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పంచాయతీల వారీగా ఇళ్ల నిర్మాణాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్లలో ఇప్పటివరకు పునాదులు కూడా ప్రారంభించని వారిని గుర్తించి వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఎటువంటి సమస్యలున్నా పరిష్కరించాలన్నారు. అనంతరం పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లతో సమావేశమయ్యారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో చేపట్టిన పనులు పూర్తి చేయడంతో పాటు వాటికి సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేయాలన్నారు.

పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలి


గుమ్మలక్ష్మీపురం: సవర భాషా వలంటీర్లకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఏఎంఓ శ్రీనివాసరావు

- ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి


సీతంపేట: సవరభాష పుస్తకాలు అందజేస్తున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ప్రాథమిక పాఠశాలల్లో సవర భాషా బోధన పటిష్టంగా అమలు చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం సవర భాషా వలంటీర్లకు వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆదివాసీ చిన్నారులకు అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను బోధనలో అమలు చేయాలని సూచించారు. గ్రామాల్లో డ్రాపౌట్లు లేకుండా చూడాలన్నారు. అనంతరం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంఓ కోటిబాబు, సీఎంఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: మండలంలో పనిచేస్తున్న సవర భాషా వలంటీర్లకు పార్వతీపురం ఐటీడీఏ ఏఎంఓ శ్రీనివాసరావు సవర భాషా పాఠ్యపుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు అర్థమయ్యే రీతిలో భాషా బోధన చేయలన్నారు. సవర భాష మాట్లాడే విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు మెరుగుపర్చేందుకు వలంటీర్లు కృషి చేయాలని సూచించారు.

చేనేత పరిశ్రమను అభివృద్ధి చేయండి



బలిజిపేట: చేనేత పరిశ్రమను అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని హ్యాండ్‌లూమ్స్ టెక్నికల్ ఎ.డి ధర్మారావు అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని నారాయణపురంలో చేనేత కార్మికులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణపురంలో చేనేత క్లస్టర్ ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. అందుకు మొదటి విడతగా 90శాతం రాయితీపై 17సోలార్ లైట్లు, 6మగ్గాలకు షెడ్లు మంజూరయ్యాయని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని రాయితీలతో అవసరమైన సామగ్రి మంజూరయ్యే అవకాశాలున్నాయని తెలిపారు. వాటితో చేనేత పనిని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ పరిశ్రమకు రానున్న రోజుల్లో మంచి ఆదరణ లభిస్తుందని చెప్పారు. చేనేత కార్మికులకు ఒక భవనం ఏర్పాటు చేసుకోవాలని అందుకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. క్లస్టర్‌ను సమర్థవంతంగా నడుపుకోవాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. కార్యక్రమంలో ఏడీఓ వెంకటరమణ, సీహెచ్.నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం


మరమ్మతులకు నోచుకోని జంఝావతి ఎత్తిపోతల పథకం

కొమరాడ: జంఝావతి రిజర్వాయర్ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని పంటలకు సాగునీరు అందక రైతులు నష్టపోతున్నారు. ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జంఝావతి నదిపై రబ్బర్ డ్యాం నిర్మించారు. లోలెవల్ కెనాల్ ద్వారా సుమారు 12 వేల ఎకరాలకు సాగునీరు అందించేవారు. కుడికాలువకు మోటార్లతో నీటిని ఎత్తిపోయడం ద్వారా మరో వెయ్యి ఎకరాలకు నీరు అందించేవారు. అయితే జంఝావతి ప్రాజెక్టు అధికారులు ఎత్తిపోతల పథకం పర్యవేక్షణను పూర్తిగా గాలికొదిలేశారు. ఈ ఏడాది సాగునీటి విడుదలలో ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. దీంతో రాజ్యలక్ష్మీపురం, కుమ్మరిగుంట, కందివలస, కంబవలస, కోనవలస తదితర గ్రామల్లో సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. సాగునీరు విడుదల చేయాలని అధికారుల వద్ద పలుమార్లు మొరపెట్టుకున్నా..వారి నుంచి కనీస స్పందన లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సాగునీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

20న వాహనాల వేలం

కురుపాం: సారా కేసుల్లో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలను ఈ నెల 20న వేలం వేయనున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై బీవీఎస్ భూషణరావు మంగళవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఈబీ స్టేషన్ ఆవరణంలో ఉదయం 11 గంటలకు వాహనాలను వేలం వేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు రూ.2 వేలు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని, పాట పూర్తయిన తరువాత ప్రవేశ రుసుం తిరిగి చెల్లించనున్నట్లు చెప్పారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు రక్ష

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి


పాలకొండ రూరల్: వెలగవాడ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యసేవలపై ఆరాతీస్తున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ రూరల్: వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు మారుమూల పల్లెలకు వైద్య సేవలను చేరువ చేసిన ఘనత జగనన్న సర్కారుదే అని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని వెలగవాడ గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రజలకు వారు ఉన్న ఊర్లోనే మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం శిబిరం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కె.సూర్యప్రకాష్, వి.అనిల్‌కుమార్, మాజీ సర్పంచ్ కాంతారావు, శ్రీరాములనాయుడు, ఎంపీడీఓ జ.ఉమామహేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య తదితరులున్నారు.

305 మందికి వైద్య పరీక్షలు

- వీరఘట్టం: మండలంలోని తూడి గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 305 మందికి వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు అందించినట్లు తహసీల్దార్ చందక సత్యనారాయణ తెలిపారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను వైస్ ఎంపీపీ పర్రి విజయకుమారి, సర్పంచ్ కుద్దిగాన వెంకటరమణమూర్తి, తదితరులు పరిశీలించారు.
- కొమరాడ: విద్యా, వైద్యానికి జగనన్న ప్రభుత్వం అధికా ప్రాధాన్యత ఇస్తోందని, ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి అన్నారు. మండలంలోని గుణానపురంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె సందర్శించారు. అక్కడ అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లికార్జునరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డి.జనార్దనరావు, సర్పంచ్ మిరయాల పద్మావతి తదితరులు పాల్గొన్నారు.
- భామిని: మండలంలోని నేరడి-బిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ సరిసాభద్ర జగదాంబ, వైఎస్సార్‌సీపీ నాయకులు అర్లి రాజశేఖర్, ఎస్.కృష్ణమూర్తి శిబిరాన్ని, పౌష్టికాహార స్టాల్‌ను ప్రారంభించారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామీణ ప్రాంత ప్రజలకు ఓ వరమన్నారు. నిపుణులైన వైద్యులు మన ఊరు వచ్చి వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులు ఉచితంగా అందిస్తున్నారని, వారి సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఎంపీడీఓ జి.చంద్రరావు, డిప్యూటీ తహసీల్దార్ నిమ్మల శేఖరం, ఎంఈఓ వి.భాస్కరరావు, ఐసీడీఎస్ ఎస్ఓ జ్యోతిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


వీరఘట్టం: అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన


కొమరాడ: గుణానపురంలో ఆరోగ్య సురక్ష శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి


భామిని: నేరడి-బిలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

పాఠశాలకు రూ.25 వేలు వితరణ


ఇజ్జకాయి గ్రామస్తులకు నగదు అందజేస్తున్న అధికారులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఇజ్జకాయి గ్రామంలో పాఠశాల మరమ్మతులకు ఎమ్మార్సీ సిబ్బంది రూ.25 వేలు వితరణ చేశారు. బీరపాడు గ్రామంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు తదితరులు ఇజ్జకాయి గ్రామస్తులకు అందజేశారు. గత నెలలో కురిసిన వర్షాలకు పాఠశాల భవనం దెబ్బతినడంతో దాని మరమ్మతుల కోసం ఎంఈఓలు బి.చంద్రశేఖర్, బి.జనార్దననాయుడు, ఎమ్మార్సీ సిబ్బంది తమ వంతు సాయంగా ఈ మొత్తాన్ని అందజేశారు.